# ఆ హా హా!

కొండల గర్భంలో మహారణ్యం మధ్య —ఉద్యోగం గుమాస్తాగిరీ అయినా – ప్రదేశం కన్నుల వైభవంగా ఉండడాన్ని వెంకటపతిరాజు "ఆహాహా!" అనుకొన్నాడు.

కొండల కడుపులని అడ్డంగా కోసేసి కొండలచుట్టూ వలయాలు వలయాలుగా వేసిన ఆ కొత్తరోడ్డు ఎత్తుకి. పై ఎత్తుకి, లేచిపోతున్నాది. జీపు బ్రహ్మాండమైన వేగంతో మలుపులు తిరుగుతూ ఉంటే వెంకటపతిరాజు అందాలని ఆనందిస్తున్నాడు.

"వెంకటపతీ నువ్వు తుపాకీ బాగా గురితో కొడతావుట" అన్నాడు తనని తీసికెళుతున్న మేనేజరు.

"మీ కెలాగ తెలిసిందండి?" అని ఆశ్చర్యపడ్డాడు వెంకటపతిరాజు.

"ఎన్.సి.సీ. సర్టిఫికెటు చూశానుగా!"

"కొట్టగలనండి. ఐతే ఎప్పుడూ వేటకి వెళ్ళడం పడలేదు."

"ఆ సరదా ఇక్కడ బాగా తీరుతుందిలే."

"షికారీలు ఉన్నారా సార్?"

"మనవాళ్ళంతా షికారీలు. కూలివాళ్ళంతా బికారీలు."

"ఏంసార్ అలాగన్నారు? ఇక్కడ కూలి రెండురెట్లు ఇస్తున్నారు?"

"ఈ చేత్తో ఇస్తారు; ఆ చేత్తో తీసుకుంటారు? హిహ్హిహ్హిహీ! ప్రోజెక్టు గుడిసెలచుట్టూ ముప్పై నలభై సారాదుకాణాలు మనవాళ్ళే పెట్టారు!"

"పాపం!"

"నువ్వు వుత్త కుర్రాడివోయ్! హాయిగా కష్టపడతారు. పీకమొయ్యా తాగుతారు. కడుపెక్కా తింటారు. వాళ్ళవెంటే దిగబడ్డాయి అన్ని

దుకాణాలూ, చుట్టలూ, బీడీలు, కిరాణా, టీ సమస్తం వెలిశాయి. దుకాణా ల్లోకి గుడిసేట్లూ చేరుకున్నారు" అన్నాడు మేనేజరు.

కొండల అంతరాళాల్లోకి వెన్నంటి మన వెంటే మన నీతీ చేరు కుంటున్నాది.

"మనదేశం అరణ్యంలోకెళ్ళినా ఒక్కలాగుంది !" అన్నాడు వెంకటపతిరాజు.

"అరణ్యం మాత్రం మనదేశంలో భాగం కాదా? నువ్వు కుర్రాడి వోయ్" అన్నాడు మేనేజరు.

"ఔను!" అని నిట్టూర్చాడు వెంకటపతి.

"ఇలాగైతే దండపాణిగారి దగ్గర నువ్వు పని చెయ్యలేవోయ్."

"నాకెందుకండీ. బుర్రొంచుకుని నా పని చేసుకుంటాను."

"ఐతే పనికొస్తావు."

చిత్తం మహాప్రభో అని చేతులు కట్టుకొని పని చేసుకోడానికే వెంకటపతి అరణ్యంలోకి ప్రవేశిస్తున్నాడు. ఇంటిపేరు బాగా బాగా పెద్దదే. కాని కస్తూరివారి యింటిలాగ తనయిల్లూ గబ్బిలాలి కంపే. ఎక్కడా ఆధారం లేక బతుకుదారి పర్వతాలలో ఉందని వెళ్తున్నాడు.

జీపు భయంకరమైన మలుపులోకి వచ్చి ఆగిపోయింది. కొండల గుండెలలోంచి రాకాసిశబ్దాలు వస్తున్నాయి. కొండనెత్తిమీంచి పెనుమేఘాల లాగ, ఎండలో ఎరుపెక్కి ధూళి తోవంతా నిండిపోతున్నాది. లారీ, లారీ వెనుక లారీ, ట్రక్కూ, ట్రక్కు వెనుక ట్రక్కూ వాతికముప్పై ఒకదాని వెనక మరొకటి దుమ్మెత్తిపోస్తూ, శివమెత్తిపోతూ కొండలు దిగివచ్చి కొండ దిగిపోతూ దూసుకుపోయాయి.

"ఆహాహా ! మానవుడెంత గొప్పవాడు!" అనుకున్నాడు వెంకట పతిరాజు. వాళ్ళ జీపు మళ్లా ప్రాజెక్టు స్థలానికి ప్రయాణం సాగించింది.

ఎదురొచ్చిన మహాపర్వతం మీద మహాసర్పంలాగ ఏదో మిల మిల్లాడుతున్నాది. పర్వత శిఖరం నుంచి యించుమించు కిందిదాకా సర్వాం నడకతో జిగజిగ లాడుతున్నాది.

"ఏమిటో ఆ కొండమీద!" అన్నాడు వెంకటపతిరాజు.

"కనబడ్డం లేదోయ్ కొండవాగు. తిన్నగా రెండడుగుల వెడల్పుండదు. వేగం అంటావా? గంటకి కొన్ని వందలమైళ్ళు! దాంట్లో పొరపాటున కాలు ఎవడైనా పెట్టాడో—గోవిందా-పాతాళంలోకి కొట్టుకుపోతాడు! అంత మహావేగం! మన రోడ్డుకి అడ్డం వస్తుంది చూద్దువుగాని" అన్నాడు మేనేజరు.

"జీపు దాటుతుందా?"

"చూస్తావుగా ఎలాగ దాటుతుందో!"

ఆ మహా పర్వతఝురి ఎప్పుడొస్తుందని చూస్తూ ఉండగా వచ్చేసింది. మస్తిష్కం వున్నవాడు మనిషి. విశాలంగా ఝురిమీద బ్రిడ్జి కట్టేశాడు. అది ఎంత కదనుతొక్కినా బ్రిడ్జి కిందే. జీపు చర్రున దాటిపోయింది. ఝురి ఉరకలతో కిందికి దిగి ఉరకలతో లోవలోకి దిగిపోయింది.

"పుట్టుక ఎక్కడో కలయిక ఎక్కడో!" అన్నాడు మేనేజరు.

"మంచినీళ్ళు ఉప్పునీళ్ళపాలు" అన్నాడు వెంకటపతి.

"అందుకేగా ప్రాజక్టులు కడుతున్నాము" అన్నాడు మేనేజరు.

పర్వతం అడుగునుంచి చిన్న బర్రుబర్రులు ప్రారంభమైనాయి. లోవ క్రింద భాగం ధూళిపోసుకుంటున్నాది. కొండ అడుగు భాగాన్ని చుట్టుకొస్తున్న రోడ్డుమీంచి లారీలబారు మీదికి వస్తున్నాది.

"కిందికి చూడు. అవే మన లారీలు" అన్నాడు మేనేజరు. కొండ రోడ్డు వంకరలలోంచి ఎగబడి బరువులు మోసుకొస్తున్నాయి లారీలు.

జీపు మరో మలుపు తిరగ్గానే ఎదురైంది మరో జీపు. జీపుని చూసి జీపు టక్కని ఆగిపోయింది. ఎదురు జీపులోంచి దిగారు దండపాణిగారు.

దండపాణిగారు రోడ్డుమీద నిలబడితే ఆయన వెనక కొండలు, లోవలు, హారాలుకట్టి కనబడుతున్నాయి. మిన్నులు పడ్డచోట విశాలంగా, దూరపు సముద్రంలాగ మిలమిల్లాడు తున్నాది. ఆకాశం చివర్లదాకా ఉన్న భూమికీ ఈ అరణ్యావృత మహా పర్వతాలకీ నేనే అధిపతినన్నట్టు ఠీవిగా దండపాణిగారు మందహాసంతో నిలుచున్నారు.

"వెంకటపతికి పద్ధతంతా చెప్పి వెంటనే వొచ్చెయ్" అని మేనేజరు గారితో దండపాణిగారు చెప్పారు.

వెంకటపతి తలదించుకొని వినయంతో కుంగిపోయాడు. పెద్దల దగ్గర తనకున్న అలవాటు చొప్పున చేతులు కట్టుకున్నాడు.

"వెంకటపతీ!" అని పిలిచారు దండపాణిగారు. ఆ పిలుపు తండ్రి కొడుకుని చిన్ననాటి నుంచీ పిలిచే తీరున ఉంది కాని దండపాణి అనే ఇంజనీరింగు కంట్రాక్టర్స్ ఫర్మ్‌కి అధిపతి తన అట్టడుగు గుమస్తాగాణ్ణి పిలిచేతీరున లేదు.

"చిదం" అని వెంకటపతి మరింత ముడుచుకుపోయాడు.

"ఏమిటా చిదం? చిత్తం అని సరిగ్గానైనాకాదు! నువ్వు రాజువైతే అయినావుకాని నా దగ్గరెప్పుడూ చిదంలు కొట్టకు" అన్నారు దండపాణిగారు.

మళ్ళా "చిదం" అని నోటి చివరిదాకా వచ్చి "అలాగేనండి" అని సర్దుకున్నాడు వెంకటపతి.

దండపాణిగారు పకపక నవ్వారు. అంత వాత్సల్యం, ప్రేమా చూపుతున్న దండపాణిగారిని ఘాతకుడని, అయిదు ఖూనీలు చేయించాడని లోకం ఎందుకు చెప్పుకుంటుందా అని వెంకటపతి ఆశ్చర్యపడ్డాడు.

"నీకు జీతం ఎంత కావాలి?" అని సూటిగా అడిగారు. చిక్కు ప్రశ్నే. ఎంతని అడగడం?

"నలుగురికీ ఇచ్చినట్టే ఇప్పించండి" అన్నాడు వెంకటపతి.

"అందరికీ ఒక్కలాగ ఇవ్వడం మన మతంకాదు. అందరూ సమానులన్న ఫిలాసఫీ మండికాదు."

వెంకటపతి నేలకి మొహందించుకొని "తమరెంత దయతలిస్తే అంత" అన్నాడు.

"మీ నాన్నగారు పోయారు. మీ తల్లిగారున్నారా?"

"ఉన్నారండి."

"మీ కుటుంబం యింకెవరున్నారు?"

"మా తమ్ముడూ, చెల్లీ."

"తమ్ముడేం చదువుతున్నాడు?"

"ఫోర్తుఫారం చదువుతుండగా మా నాన్నగారు పోయారు. దాంతో వాడి చదువాగి పోయింది. చెప్పించలేకపోయాం."

"ఫస్టు తారీకున మేనేజరు వస్తాడు. నూటయాభై రూపాయలు పుచ్చుకొని మీ తల్లిగారికి నెలనెలా పంపుతూ ఉండు."

"ఇక్కడ నా కండి?" తెలివితక్కువగానే అడిగాడు.

"దద్దమ్మలాగ దద్దయ్య మాటలాడకు" అని కసిరారు. కసిరినా వారి మొహంలో మందహాసమే ఉంది.

"అలాగేనండి" అన్నాడు వెంకటపతి. దండపాణిగారు జీపు ఎక్కారు.

"శలవ్" అన్నాడు మేనేజరు.

"శలవ్" అన్నాడు వెంకటపతి.

"శుభం" అన్నాడు దండపాణిగారు. జీపు బర్రుమంది. ఝామ్మని కొండ రోడ్డునపడి ఎగిరిపోయింది.

"చెప్పానుగా. నువ్వింకా కుర్రకుంకవి.... మెస్సుంది భోంచేస్తావు. ఎప్పుడడిగినా, ఎన్నిసార్లడిగినా టీ ఇస్తారు. ఏం కావలసివచ్చినా స్టోరుంది. తీసుకోవడమే" అన్నాడు మేనేజరు. దండపాణిగారి ఔదార్యం అసాధారణంగా ఉంది. జీపు ఎక్కి ప్రోజక్టు స్థలానికి ప్రయాణం సాగించారు.

రోడ్డునిండా, రెండుపక్కలా ఉన్న చిన్న చెట్లమీద వందనెమళ్ళు వాలి ఉన్నాయి. జీపు కనబడగానే చెట్ల తలమీదికి ఒక్కసారిగా పెద్ద శబ్దాలతో ఎగిరాయి; వంద నెమళ్ళు ఒక్కసారి వంద షడ్జమ క్రేంకారాలతో.

"ఎన్ని నెమళ్ళో!" అన్నాడు వెంకటపతి.

వంద నెమళ్ళు, వంద కేకలు!

"ఇవేమిటి, లక్షలున్నాయి పక్షులు!" అన్నాడు వెంకటపతి.

"చూడవలసిన దృశ్యం చూశాం."

"ఒక దఫా నేనొచ్చినపుడు మనవాళ్ళు పిట్టలబార్లు పట్టుకెళ్ళి పది నెమళ్ళు కొట్టుకొచ్చారు. రెండుపూటలా నెమలి మాంసం తినలేకచచ్చాను" అన్నాడు మేనేజరు. వెంకటపతికి కలిగిన మధురభావమంతా బీభత్సమైపోయింది.

"నువ్వు తుపాకి పేలుస్తావుగా. కావలసినన్ని పట్టుకొద్దువుగాని, అడవిపందులు, కారుగొర్రెలు, నీ యిష్టం. షికారీలు మీరు తేవాలిగాని ఇక్కడ పులావులకు లోటులేదు."

నెమళ్ళ క్రేంకారాలు వినబడుతూనే ఉన్నాయి. మేనేజరుగారి మాటల ప్రభావంవల్ల వెంకటపతికి నెమళ్ళ కంఠాల్లోంచి షడ్జమగానం వినబడలేదు. నెమళ్ళ కంఠాల్లోంచి యథార్థంగానే భయవిహ్వలత వినవస్తున్నాది. లోవంతా అడ్డదిడ్డంగా ఎగురుతున్న నెమళ్ళు మనోహరంగా ఎగరడంలేదు. వాటి శరీర విన్యాసాలు భయప్రకంపనాలే!

జీపు కొండలకిందకి తీసుకుపోతున్నాది.

"ఇక్కడికి రెండుమైళ్ళే ఉంటుంది మన ప్రోజెక్టు" అన్నాడు మేనేజరు. కొండని చుడుతూ కొండవతలికి తిరిగింది రోడ్డు. ఎదురుగా ఉంది నిర్మాణమౌతున్న మహా ప్రోజెక్టు.

"అదిగో చూడు" అన్నాడు మేనేజరు. పెద్ద పెద్ద షెడ్లూ, బస్తాల రాసులు, లారీలు, ట్రక్కులు, లెక్కలేనన్ని గుడిసెలు, గుడారాలు, టెంపరరీ బంగళాలు, వాటన్నింటి మీదికి లేచి నిలబడ్డ క్రేనులు ఒక్కసారిగా కనబడ్డాయి. స్థలమంతా అతి చిన్నగా చీమల్లా కనబడ్డారు మనుషులు.

అక్కడ వెంకటపతికి లోట్లులేవు. అతనికి ఒక గుడారం ప్రత్యేకంగా ఉంది. అందులో కేంపుకాటు, టేబిలు, కుర్చీ ఉన్నాయి. అదే వాడి ఆఫీసు. అదే వాడి మకాం.

మేనేజరుగారు ఉంచవలసిన ఫైళ్ళు, రాయవలసిన ఎకౌంట్సు, రసీదులు, వోచర్లు మొదలైనవన్నీ అప్పచెప్పేరు. వాళ్ళకి సంబంధమున్న పెద్దలు, పిన్నలు అయిన ఆఫీసర్లు, ఇంజనీర్లు, గుమాస్తాలు ఎవరు ఎవరో పరిచయాలు చేశారు. ముఖ్యంగా గుమస్తా గోవిందాన్ని అప్పచెప్పి వెళ్ళిపోయారు.

సాయంకాలం ఐదు గంటల ప్రాంతంలో రోజూ గుమస్తాగోవిందం వస్తాడు. ఇంజనీర్ల సంతకాలతో సహా పూర్తి అయిన కాయితాలు తెచ్చి ఇచ్చేస్తాడు. వాటిని జాగ్రత్తగా వివరాలు నోటుచేసి, ఎకౌంటు రాసుకొని, ఫైలు చెయ్యడం, ఉదయం హెడ్డాఫీసుకి పోస్టు చెయ్యవలసిన కాయితాలు తయారుచేసుకోవడం, కవర్లలో పెట్టి ఎడ్రస్సులు రాయడం - అంతే. తిన్నగా గంటయినాలేదు అతని పని.

దండపాణిగారు ప్రోజక్టుకి ఇసక లారీలతో సప్లై చేస్తున్నారు. అదే వారి కంట్రాక్టు. ఆ కొండల మధ్య రాళ్ళూ రాపాషాణాలూ ఉన్నాయి

కాని ఇసకలేదు. సిమెంటుపనికి కావలసిన ఒక మహా పర్వతమంత ఇసక కిందనుంచి రావలసినదే. ఇసక తెచ్చే కంట్రాక్టు దండపాణి గారొక్కరికే ఇవ్వలేదు. ఇంకా పన్నెండుగురు అదే కాంట్రాక్టు చేస్తున్నారు.

వెంకటపతిరాజు నెలజీతం తల్లికి పంపాడు. తన కిస్తున్న డబ్బు అన్యాయంగా కనబడ్డాది. లారీలు తెచ్చిన డ్రైవర్లే రశీదులు పట్టికెళ్ళగలరు కదా! ఇక్కడ గంట పనికి గుమస్తా ఎందుకు?

"నాకీ ఉద్యోగం ఇవ్వడం శుద్ధ దండగ" అన్నాడు వెంకటపతి గోవిందంతో.

"ఉత్త అమాయకుడివి నువ్వు." అన్నాడు గోవిందం. నెలరోజులైనా వెంకటపతి పని స్వభావం పట్టుకోలేకపోయాడు.

"రోజూ దండపాణిగారి లారీ లెన్నొస్తున్నాయి?" అని అడిగాడు గోవిందం.

"పద్దెనిమిది" అన్నాడు వెంకటపతి.

"ఎన్ని తోవలు ఇసక తెస్తున్నారు?"

"రెండు."

"నువ్వా లారీల నెరుగుదువా?"

"ఎరగను. మీరిస్తున్న నెంబర్ల ప్రకారం పద్దులు వెయ్యడమే!"

"దీనివెనకేముందో తెలుసా?"

"తెలియదు."

"గుంభనంగా ఉంది గూడుపుఠాణీ."

"నాకేమీ తెలియదు!"

"బతికే వనుకో నీ పని నువ్వు చేసుకుపో. ఇవాళో రేపో కనిపెట్టి పూర్తిగా లాగుతానులే" అన్నాడు గోవిందం.

బహుశా రోజుకి ముప్పయ్యారు తోవలు ఇసక రావడంలేదు కాబోలు! లేక పదిలారీలు వస్తే ఇరవై లారీలని లెక్క ఇస్తున్నారో!

రెండో నెల జీతంకూడా వెంకటపతిరాజు తల్లికి పంపించాడు. తనకి లోటులేదు. మెస్సులో భోజనం మహారాజ భోజనం. రోజల్లా ఖాళీ. రోజూ వస్తున్న లారీలలో దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు తొచ్చిపడుతూనే ఉంటాయి. హాయిగా చదువుకోవడం, మెస్సులో నలు

గురితో పిచ్చాపాటి వెయ్యడం. పెద్ద ఇంజనీరుగారి దగ్గిరనుంచి అంతా పరిచయస్తులే. అంతా అభిమానస్తులే. హాయిగానే ఉన్నా, తను దేశద్రోహమైన పనికి తోడ్పడుతున్నాననే అనుమానం పీడించడం మొదలెట్టింది. గోవింద మొక్కడే తనకి అంతరంగికుడు. ఇంకెవరితో నోరు విప్పినా ప్రమాదమే. తనింక చెయ్యవలసిన పని పదహారు రోజులే అక్కడ ఉంది!

ఒకనాడు మెస్సు కెదురుగా నిలబడ్డాడు మధ్యాహ్నం భోజనమైన తరువాత.

"వెంకటపతీ" అని పిలిచారు పెద్ద ఇంజనీరుగారు.

"సార్" అని దగ్గరకెళ్ళి నమస్కారం చేశాడు.

"భోజనం ఐందా?"

"చిదం"

"విచారంగా ఉన్నావేం?"

"ఏం లేదు సార్."

"ఇవాళ మాతో వేటకి రా. నువ్వు పనికొస్తావన్నారు కాని కుర్రాడివని ఎప్పుడూ పిలవలేదు. ఇవాళ రా."

"నాకు గన్ను లైసెన్సు లేదండి."

"మనుషుల్ని కొట్టంగా....పక్షుల్ని కొడతాం, పక్షుల్లాంటి మనుషుల్ని కొట్టినా ఫరవాలేదనుకో!" అని పెద్ద ఇంజనీరుగారు వారి హాస్యానికి వారు పెద్దగా నవ్వుకొన్నారు.

"చిదం. వస్తానండి." అని ఆ రోజు పిట్టల వేటకి పిట్టలబారు పట్టుకుని బయలుదేరాడు.

చిన్న కొండవాగు ఒక పల్లపు జాగాలో చిన్న మడుగును ఏర్పాటు చేసింది. పొడుగు కాళ్ళ, పొడుగు మెడల నత్తగొట్లు దండుగా ఒకేచోట నీట్లో గుమిగూడి నిలబడ్డాయి. దూరానికవి గుల్బబ్ పువ్వుల గుత్తిలాగున్నాయి.

ఆరుగురు రవ్వల తుపాకీలు ఎత్తి వన్, టూ, త్రీ అనే సరికల్లా ఒక్కసారి ధన ధన్లాడించారు. తల వెంట్రుక వాసిలో చావు తప్పిన కొంగలు చెట్లలోకి అరుస్తూ ఎగిరిపోయాయి. అరుస్తూ కొన్ని కొంత ఎత్తుకిలేచి తుప్పున నీళ్ళలోకి పడిపోయాయి. పూర్తిగా రవ్వలతూట్లు తిన్న

వన్నీ నీట్లోనే ఆర్తనాదాలు చేస్తూ గిలగిల్లాడుతున్నాయి. కొంగల ఆర్త నాదాలు కొండలు, కోనలు నిండిపోయాయి.

విజయగర్వంతో ఇంజనీరుగారు అందరినీ మడుగుదగ్గరికి నడిపించారు. పదమూడు కొంగలు దెబ్బలుతిని పడి ఉన్నాయి.

వెనక వచ్చిన బంట్రోతు నత్తగొట్లన్నింటి కాళ్ళకి తాళ్ళుకట్టి వాటి గుత్తిని చేపాటికర్ర చివరికి కట్టాడు. దాన్ని భుజాని కెత్తుకుని బయలు దేరాడు.

నల్లటి చారల తెల్లటి రెక్కల్లోంచి ఎర్రగా రక్తాలు చిమ్ముకుంటూ, నత్తగొట్ల గుత్తి చావు మూలుగులు మూలుగుతోంది.

కొంచెం సేపట్లోనే కొంగలగుత్తిలో మూలుగులు ఆగిపోయాయి. నత్తగొట్ల ముక్కులు కిందికి జారిపోయి మేకుల్లాగ కనబడుతున్నాయి. పొడుగ్గా, తెల్లగా మెడలు అల్లల్లాడుతున్నాయి.

ఇంజనీరుగారివెంట అంతా గుడారాలు చేరుకొన్నారు. ఆ రాత్రి నత్తగొట్ల మాంసం బహు పసందుగా దగ్గరుండి ఇంజనీరుగారే తయారు చేయించారు. రుచులు తెలిసినవాడూ గొప్పసరదా అయినవాడూ ఇంజనీరు.

"తాజావార్త" అంటూ పొద్దున్నే గోవిందం పలకరించాడు.

"నా కెందుకు తెలియదు? నిన్న వొచ్చిన వెయ్యిబస్తాల సిమెంటు పదిహేను వందలని ఎకౌంటులో పడ్డావి" అన్నాడు వెంకటపతిరాజు.

"అవి ఇక్కడి శక్తిస్వరూపాలకి నిత్య నైవేద్యాలు. అదికాదు. మన దండపాణిగారి లారీలు ఇక్కడికి రావడమూలేదు, ఇసకలు తేవడమూ లేదు! మనపద్దు పద్దంతా అబద్ధాల పద్దు!"

"వస్తున్న లారీలని మా మేనేజరు నాకు కంటికి చూపించాడయ్యా!"

"లారీలు వస్తున్నాయి; ఇసుక తెస్తున్నాయి, అందులో దండపాణి గారివీ ఉన్నట్టే!"

"లారీలోడు ఇసక్కి నూటపాతిక రూపాయలు కంట్రాక్టు!"

"మొత్తం ఎన్నిలక్షలు కైంకర్యమో లెక్కకట్టు!

"లెక్కకూడా ఎందుకు, మొత్తం కంట్రాక్టు మూడు లక్షల యాభైవేలు!"

"ఔను మరి, ప్రజలము ఆపదలకి లోనై వున్నాము. అందుకు ప్రాజెక్టులు కట్టుకుంటున్నాము. ఈ దేవుళ్ళకి నిలువుదోపు లిచ్చుకొంటు న్నాము. లేకపోతే మన ఆపదలు తీరవు!"

పట్టుబడకుండా ఈ డబ్బంతా వీళ్ళు పట్టుకుపోవడమే?"

"నీకు విషాదయోగం పట్టుకొంది. ఉపదేశం కావాలి. శిక్ష పొంద వలసినవాడూ శిక్ష వెయ్యవలసినవాడూ ఒక్కడే. జాగ్రత్తగా ఆలోచించు. వాడూలేడు, వీడూలేడు. ఇది మాయామేయ జగత్తు."

"ఆహా! విశ్వరూప దర్శనం ఐంది." అన్నాడు వెంకటపతి.

ప్రోజక్టు స్థలమంతా కోలాహలంగా ఉంది. డంపర్లు ఇసకనీ, పిక్కరాయినీ, మట్టినీ మోసుకెళ్ళి ధమ్మున దిమ్మరిస్తున్నాయి. కాంక్రీటు మిక్సర్లు తిరుగుడు శబ్దాలలో దెయ్యపు లొడలొడ చేస్తున్నాయి. ఇనప శబ్దాలతో కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రోజక్టుపని అమోఘంగా అవు తున్నాది. ఎన్నాళ్ళకో కొన్నాళ్ళకి పూర్తి అవుతుంది.

ఆ సాయంకాలంకూడా గోవిందం ఇసకల ఎకౌంట్లు సంతకాలతో సహా పట్టుకొచ్చి వెంకటపతికి అప్పచెప్పాడు.

వెంకటపతికి ఆరాత్రి నిద్రపట్టలేదు. ఒక పక్కనుంచి ఇసకలు వొచ్చి మేటలు పడుతున్నాయి. ఇంకొక పక్కనుంచి సిమెంటులోకి పోతు న్నాయి. కాయితాలమీద ఆ రోజు సాయంత్రం వరకూ ఎక్కడా పొర పాటు కనబడదు! వెంకటపతికి గంగవెర్రులెత్తింది. మూడు ఆకాశ రామన్న ఉత్తరాలు ముగ్గురు పైపై అధికార్లకి రాసి రాత్రిమీదే పోస్టు డొక్కులో పడేశాడు!

మర్నాడే దండపాణిగారు వచ్చారు. ఆయనవెంట మేనేజరు, మరో కుర్రాడూ వచ్చారు.

"వెంకటపతీ!" అని వాత్సల్యంతో పిలిచారు దండపాణిగారు.

"చిదం" అనబోయి—సర్దుకొని "సార్" అన్నాడు.

"ఇవాళ తిరుగులారీలో నువ్వు పట్నం వొచ్చెయ్యి. రేపుదయం నన్ను ఆఫీసులో కలుపు" అన్నాడు, ఆయన మొహంలో ఎప్పుడూ వుండే మందహాసం ఎప్పుడులాగే ఉంది,

కొత్త కుర్రాడికి, మేనేజరుకి పని అప్ప చెప్పి  నిలుచున్నపాటున పట్నం వెళ్ళిపోయాడు. మర్నాడుదయం దండపాణిగారి  ఎదుట నిలుచు న్నాడు.

"వెంకటపతీ!" అన్నారు దండపాణిగారు.

"చిదం" అనబోయి, సర్దుకొని "సార్" అన్నాడు.

"ఈ కవరు తీసికెళ్ళు, నీకు వెంటనే మంచి ఉద్యోగం  ఔతుంది" అని రికమండేషను లెటరు దండపాణిగారు అందిచ్చారు.

"ఈలోపల ఇది వాడుకో" అని మరోదిబ్బ కవరు ఇచ్చారు. దిబ్బ కవరు డబ్బుకవరే? దండపాణిగారు ఔదార్యం సామాన్యమైనదికాదు.

"తమదగ్గిర పని లేదాండి!" అని చేతులు కట్టుకున్నాడు వెంకటపతి.

"ఇక్కడ నువ్వు పనికిరావు....చూడు. ఈ కుర్రవెధవ పని ఏం చేశావో?" అని తానురాసిన మూడు ఆకాశరామన్న ఉత్తరాలూ ఎత్తి చూపించారు. ఆ ఉత్తరాలు సెన్సారై వెంటనే దండపాణిగారికి చేరి పోయాయి!

వెంకటపతిరాజు గడగడవాణికిపోయాడు. కాళ్ళలోంచి, చేతుల్లోంచి, వెన్నెముకలోంచి నరాలన్నీ ఒక్కసారి నిప్పుజెర్రుల్లా పాకిరాయి.

"భయపడకు. నువ్వు కుర్రవెధవ్వోయ్ వెళ్ళిపో శుభం" అని దండపాణిగారు బైటికి పంపించేశారు. వారి మొహంలో ఎప్పుడూ ఉండే మందహాసం ఎప్పుడులాగే ఉంది!

వెంకటపతి బైటపడ్డాడు. రక్తపుపోటుకి శరీరం పక్కకి విసిరేస్తు న్నాది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

దండపాణిగారి షెడ్డు ఆవరణంలో లారీలు బోలెడు ఉన్నాయి. ఆ లారీల నెంబరు కిందికి మీదికీ ఎగురుతూ ప్రతి అంకీ  తెండేసి మూడేసి అంకెల్లాగ కనబడుతున్నాయి.

ఇసకలు తెస్తున్నట్టు రెండు నెలలై  తాను పోస్టుచేస్తున్న నెంబర్లే.

"ఆహా!" అని నిట్టూర్చి వెంకటపతిరాజు దండపాణిగారి ఆవరణ లోంచి పూర్తిగా బైటపడ్డాడు.